# కౌసల్యా... అభివందానాలు !

పతివ్రతా శిరోమణులు చాలా మంది ఉన్నారు. వీరపత్నులూ వీరమాతలూ కొందరే ఉన్నారు.

పతివ్రత అనగానే సీతను ముందుగా తలచుకుంటాం. రావణుడు ఎత్తుకుపోయి, లంకలో తనను ఉంచినా సీత రాముడి కోసం ఎంతో నిగ్రహంతో ఎదురుచూసింది. రాముడొచ్చి, రావణుడిని చంపేక, అగ్నిపరీక్ష పెట్టినప్పుడు సీత అవమానపడే వుంటుంది. రాముడి మీద అలవిమీరిన ఆగ్రహం కలిగే వుంటుంది. అయితే, పతివ్రతా ధర్మం ఆమె ఆగ్రహాన్ని బయటకు రానివ్వకుండా ఆపి వుంటుంది.



కథా నిలయం
శ్రీకాకుళం

స్త్రీ లోలత్వంతో కన్నూ మిన్నూ కానకుండా తిరిగి, కుష్టు వ్యాధితో బాధపడుతూ, మరో స్త్రీ దగ్గరికి తనను తీసుకువెళ్లమని భర్త అడిగినప్పుడు సతీసుమతి మనసు మెలి తిరిగిపోయి ఉంటుంది. అవమానంతో ఆమె ముఖం ఎర్రబడే వుంటుంది. "ఛీ నీచుడా, ఇంక నీదారి నీది, నా దారి నాది" అనాలని అనుకునే ఉంటుంది. అయితే, పతివ్రతా ధర్మం ఆమెను ఆమెలా ఉండకుండా చేసి ఉంటుంది.

సత్యహరిశ్చంద్రుడుగా నిలవడం కోసం తనను అమ్మివేసినప్పుడు చంద్రమతి భర్తను లోలోపల అసహ్యించుకునే ఉంటుంది. అయితే, ఆమె అసహ్యాన్ని పతివ్రతా ధర్మం ఆమెలోనే ఉంచేసి వుంటుంది.

పసికందు కర్ణుడిని నదిలో వదిలేయాల్సి వచ్చినప్పుడు కుంతి తల్లి మనసు పతివ్రతా ధర్మాన్ని శపించే ఉంటుంది. ఆ రహస్యాన్ని తనలో దాచుకున్నంత కాలమూ మానసికంగా దహించుకుపోయే ఉంటుంది.

అంధుడైన ధృతరాష్ట్రుడికి భార్య అయి, తనూ కళ్లకు గంతలు కట్టుకున్నందుకు మహా పతివ్రతగా పేరుతెచ్చుకున్నా అందాల ప్రపంచాన్ని చూడలేక పోతున్నందుకు విచారించే ఉంటుంది.

తండ్రి మాటను జవదాటకుండా ఉండడం కోసం కన్నకొడుకు పరశురాముడు తనను చంపడానికి తన మెడపై కత్తి మోపినప్పుడు ఆ తల్లి ఎంతగానో తల్లడిల్లిపోయే ఉంటుంది. భర్తను 'ధూర్తుడా' అనీ, కొడుకును 'మూర్ఖుడా' అనీ మనసులో దూషించే ఉంటుంది. పతివ్రతా ధర్మం ఆమె కోపాన్ని శాంతింపజేసే ఉంటుంది.

తమ భావాల్ని తమలోనే దాచుకోకుండా బయటకు వ్యక్తం చేసిన వాళ్లూ ఉన్నారు. యుద్ధాల్లో పాల్గొన్న వాళ్లూ ఉన్నారు. కైక దశరథునితోపాటు యుద్ధంలో పాల్గొంది. వీరపత్నిగా నిలిచి భర్త నుంచి వరాలు పొందింది. ఆ వరాల కారణంగానే తన కుమారుడు రాముడు అరణ్యవాసం చేయాల్సి వచ్చినప్పుడు కౌసల్య హృదయం కణకణమండి పోయే ఉంటుంది. తన భర్త దశరథుడినీ, తన సవతి కైకనూ మనసులో తిట్టుకునే ఉంటుంది.

పాండవులు జూదంలో తనను ఒడ్డి, ఓడినప్పుడు ద్రౌపది మౌనంగా ఉండిపోలేదు. "తన్నోడి నన్నోడెనా, నన్నోడి తన్నోడెనా" అని ప్రశ్నించింది. తన జుట్టుపట్టుకుని నిండు సభలోకి దుశ్శాసనుడు లాక్కొచ్చినందుకు, తన తొడపై కూర్చోమని దుర్యోధనుడు అన్నందుకు అవమానపడి, వాళ్లను చంపి ఆ రక్తంతో తన తలకు నూనెగా రాసేవరకూ జుట్టు ముడివెయ్యనని ఆమె శపథం చేసింది. ఆ పని జరిగేదాకా భర్తల్ని రెచ్చగొట్టింది. అయిదుగురు భర్తల్నీ యుద్ధానికి పంపి వీరపత్ని అనిపించుకుంది.

తరచూ అలకపాన్పులెక్కి తనక్కావల్సినవి సాధించుకునే సత్యభామ కృష్ణుడితో యుద్ధానికి వెళ్లడమే కాకుండా నరకాసురుడిని వధించింది. వీరపత్నిగానే కాక, వీర వనితగానూ పేరొందింది.

మహావీరుడు అర్జునుడి భార్యగా వీరపత్ని అయిన సుభద్ర కుమారుడు అభిమన్యుడిని యుద్ధానికి పంపి వీరమాత అయింది.

నవయవ్వన దశలో అభిమన్యుడిని యుద్ధానికి పంపి శశిరేఖ వీరపత్ని అనిపించుకుంది.

యుద్ధం నుంచి వెనక్కి వచ్చిన భర్తకు పసుపునీళ్లిచ్చి ఎగతాళిచేసి కదనరంగానికి పంపి, ఖడ్గతిక్కన భార్య వీరవనితగా భాసిల్లింది.

బాలచంద్రుడిని సమరానికి పంపి, మాంచాల వీరమాత అయింది.

స్వాతంత్ర్యేచ్ఛతో ప్రాణాలకు తెగించి పోరాడి ఝాన్సీరాణి వీరవనితగా నిలిచింది.

వీరిలాంటి వారు ఆ తర్వాత కొందరున్నారు.

వీరిలో ఏదో ఒక విషయంలో రాజీపడ్డవారు ఉన్నారు. నోరొత్తని వారున్నారు

నేటి కౌసల్య అలాంటిది కాదు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తల్లిగా ఆమె వీరమాత. చంద్రశేఖర్ హత్యకు గురయ్యాక, ప్రధాని ప్రకటించిన లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియాను ఇటీవల పాట్నాలో కౌసల్య తిరస్కరించింది. తన కుమారుడి హత్య వెనుక జనతాదళ్ ఎంపీ మహ్మద్ షాబుద్దీన్ హస్తం ఉందని, అతన్ని ఉరితీసే వరకూ పోరాడతాననీ ఆమె స్పష్టం చేసింది. "సాహసవంతుడైన కుమారుడికి జన్మనిచ్చిన వీరమాతను. నాకు ఎలాంటి నష్టపరిహారం అక్కర్లేదు. హంతకులతో రాజీకి రాలేను" అంది. ఆమె భర్త భారత్-పాక్ యుద్ధంలో విమానం నడుపుతూ ప్రాణాలు కోల్పోయిన సైనికోద్యోగి. అలా ఆమె వీరపత్ని.

"నా భర్త యుద్ధంలో చనిపోయేనాటికి నాదగ్గర కేవలం నూట యాభై రూపాయలున్నాయి. అప్పటికి చిన్నపిల్లవాడైన చంద్రశేఖర్‌ను ఎవరి సహాయం తీసుకోకుండా కష్టపడి ప్రయోజకుడిని చేశాను. "నాదగ్గర ఇంకా కాస్త డబ్బుంది. ప్రధానిగారూ, మీక్కావలిస్తే చెప్పండి. చెక్కు రూపంలో పంపగలను" అని కౌసల్య ప్రధానికి రాసిన లేఖలో ఎత్తిపొడిచింది. కౌసల్య స్థాయికి నేటి ఆధునిక స్త్రీ ఎదగాలి.

అమ్మా కౌసల్యా, నీ మనోధైర్యానికీ, నీ పోరాట స్ఫూర్తికీ, నీ ఆత్మగౌరవానికీ నా వందనాలు, అభివందనాలు.

25.4.97, వార్త దినపత్రిక